సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 16 । జూన్ । 2023



బీజేపీ, బీఆర్ఎస్ తోడుదొంగలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నాయని కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ఆరోపించారు.

- 10లో



కల్నల్ సంతోష్‌బాబు వర్ధంతి

దివంగత కల్నల్ సంతోష్ బాబు త్యాగం చరిత్ర పుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం 41°/31°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎక్కువ వెచ్చగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

జూలై 2న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: ఏఐసీసీ ఆధ్వర్యంలో జూలై 2న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో 16 నుంచి 35 ఏళ్ల లోపు వారు పాల్గొనాలని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ క్విజ్ పోటీలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు, సానుభూతి పరులు, వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులంతా పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో విజేతలకు ఎలక్ట్రిక్‌స్కూటీ, లాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, టాబ్‌లెట్, స్మార్ట్‌వాచ్, హార్డ్‌డ్రైవ్, పవర్ బ్యాంక్ బహుమతులుగా అందజేస్తారని ఆయన తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ 1, 7, 2, 4వ స్థాయీ సంఘాల సమావేశాలు మధ్యాహ్నం 2గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక అధ్యక్షత నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈఓ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గ్రామాభివృద్ధికి కృషిచేయాలి



మాధవరంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సురేష్

మునగాల((కోదాడ): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను పంచాయతీ పాలకవర్గాలు అమలు చేసి గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని జెడ్పీసీఈఓ జి.సురేష్ కోరారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మునగాల మండలంలోని మాధవరంలో నిర్వహించిన పల్లెప్రగతి దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లెప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామం, పారిశుద్ధ్యం తదితర కార్యక్రమాల పట్ల పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎన్.భూపాల్‌రెడ్డి, గ్రామసర్పంచ్ సంధ్యాల విజయలక్ష్మి, ఉప సర్పంచ్ ఆరె.జానకమ్మ, పంచాయతీ కార్యదర్శి అక్షిత పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు నిర్వహించారు. శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్ర నామార్చన చేశారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

యాదాద్రి ఆలయానికి హుండీల బహూకరణ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన ఉప్పల సుభాష్ రెండు కార్పస్ (బట్టతో తయారు చేసిన), మూడు ఇత్తడి హుండీలను బహూకరించారు. గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో హుండీలకు పూజలు చేసి అధికారులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.3లక్షలు విలువ ఉంటుందని సుభాష్ తెలిపారు.



హుండీలను అందజేస్తున్న భక్తుడు సుభాష్, కుటుంబ సభ్యులు

రూ.లక్ష సాయం ఎందరికో!

- బీసీలకు పూర్తి సబ్సిడీపై ఇస్తామని ప్రభుత్వం ప్రకటన
- 15 ఉపకులాలకే దరఖాస్తులకు అవకాశం
- 20వ తేదీ వరకు గడువు
- ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 7,171
- జిల్లాలో సుమారు 50 వేల కుటుంబాలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ యువత స్వయం ఉపాధికి బాటలు వేసేందుకు 15 ఉపకులాలకు పూర్తి సబ్సిడీతో రూ.లక్ష ఆర్థికసాయం చేయాలని నిర్ణయించింది. దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు విధించడంతో ఆయా కులాల్లోని చిరు వ్యాపారులతో పాటు కొత్తగా ఉపాధి మార్గం ఎంచుకోవాలనుకునే వారు దరఖాస్తులు చేసుకునేందుకు ఆన్‌లైన్ కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణలతో సహా ఇతర పత్రాలను సమకూర్చుకుంటున్నారు. బీసీలకు ఏడేళ్లుగా ప్రభుత్వం ఎలాంటి రుణాలు అందించకపోవడంతో వందశాతం సబ్సిడీతో ఇవ్వనున్న రూ.లక్ష ఆర్థిక సాయం పొందేందుకు దరఖాస్తులు భారీగా రానున్నట్టు తెలుస్తోంది. గురువారం నాటికి జిల్లా వ్యాప్తంగా 7,171 దరఖాస్తులు రాగా ఇందులో అత్యధికంగా కోదాడ పట్టణ పరిధిలో 529, అత్యల్పంగా తిరుమలగిరి మండలంలో 59 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 9న జిల్లా కేంద్రంలో 18మందికి మాత్రం విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష చొప్పున చెక్కుల పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన ఆయా కులాలకు సంబంధించి జిల్లాలో సుమారు 50 వేల కుటుంబాలు ఉండడంతో ఇందులో ఎంతమందికి రూ.లక్ష ఆర్థికసాయం అందుతుందోనని బీసీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

గతంలో ఇలా..

గతంలో కేటగిరీ–1 కింద రూ.50వేల నుంచి రూ.లక్ష, కేటగిరీ–2 కింద రూ.2 లక్షల వరకు, కేటగిరీ–3 కింద రూ. 2 లక్షల నుంచి రూ.10లక్షల వరకు రాయితీ రుణం అందేది. ఈ సారి తక్కువ మొత్తంతో ఎక్కువ మంది బీసీ లబ్ధిదారులకు చేయూతనివ్వాలని ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రస్తావన తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది.

పెరగనున్న పోటీ..

వెనుకబడిన తరగతులకు చెందిన 14 కులాలతో పాటు ఎంబీసీలకు పూర్తి సబ్సిడీతో ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిచనుంది. ఇందుకు నాయీబ్రాహ్మణ, రజక, ఉప్పర, కుమ్మరి, అవుసలి, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, పూసలి, మేదర, వడ్డెర, ఆరెకటిక, మేరతో పాటు ఎంబీసీ కులాలకు చెందిన వారు అర్హులుగా నిర్ణయించింది. నియోజకవర్గానికి 1,500 మంది లబ్ధిదారులకు అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అంటే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 6వేల మందికి అందే అవకాశం ఉంది. దీంతో అర్హుల ఎంపిక విషయంలో విపరీతమైన పోటీ ఉండనుంది.

అర్హులకు అందేనా..?

గతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మూడు కేటగిరీలుగా అందించిన రుణసాయం విషయంలో జిల్లాలో పైరవీలకే ప్రాధాన్యతనిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. వచ్చిన దరఖాస్తుల్లో నుంచి తుది జాబితాలో ఎక్కువగా నాయకులు వారి అనుచరగణానికి చోటిచ్చారనే విమర్శలున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తరవాత కొన్నేళ్లపాటు ఇచ్చిన ఈ సాయం తరువాత నిలిపివేశారు. ఏడేళ్ల తరవాత మళ్లీ తెరమీదకు బీసీ రుణాల ప్రస్తావన రావడం, పైగా ఈ సారి లక్ష రూపాయలను పూర్తి రాయితీతో అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అర్హులకు ఇస్తారా.. రాజకీయం చేస్తారా అనే అనుమానాలకు తావిస్తోంది.

మండలం	దరఖాస్తులు				
గరిడేపల్లి	440	మేళ్లచెరువు	170	పాలకవీడు	218
హుజూర్‌నగర్	284	మోతె	478	పెన్‌పహాడ్	138
హుజూర్‌నగర్ (అర్బన్)	216	మునగాల	392	సూర్యాపేట	327
జాజిరెడ్డిగూడెం	193	నడిగూడెం	167	సూర్యాపేట(అర్బన్)	479
కోదాడ	329	నాగారం	164	తిరుమలగిరి	59
కోదాడ(అర్బన్)	529	నేరేడుచర్ల మున్సిపాలిటీ	80	తిరుమలగిరి మున్సిపాలిటీ	107
మద్దిరాల	165	నేరేడుచర్ల	136	తుంగతుర్తి	332
మఠంపల్లి	154	నూతనకల్	189		

బంగారు తెలంగాణకు కృషిచేయాలి



గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకట్రావు తదితరులు

- కలెక్టర్ వెంకట్రావు

చివ్వెంల(సూర్యాపేట) : బంగారు తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు పిలుపునిచ్చారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివ్వెంల మండల పరిధిలోని జి.తిర్మలగిరిలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 2014కు ముందు తర్వాత గ్రామాల్లో అభివృద్ధిని ఫ్లెక్సీల్లో చూపుతున్నారన్నారు. అధికారుల కృషివల్లే తెలంగాణ అభివృద్ధి చెందడంతో పాటు, జీడీపీ పెరిగిందన్నారు. ఐటీ రంగలో 1.32 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్లు వేశారన్నారు. నిధులు, నీళ్లు, నియామకాల విషయంలో సఫలమైందన్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన సర్పంచ్ నిర్మల గోవిందరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మహిళా సంఘాలకు శ్రీనిధి ద్వారా 10 రెట్లు ఎక్కువగా రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు త్వరలో ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, పరిశ్రమలు, గృహాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తోందని, ఇది విద్యుత్ ఉద్యోగుల విజయమన్నారు. గ్రామాల్లో సేదదీరడానికి పల్లె ప్రకృతి వనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పరిశుభ్రతకు పల్లె ప్రగతిలో భాగంగా ట్రాక్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు పంచాయతీ కార్యదర్శులను నియమించిందన్నారు. ఈసందర్భంగా పంచాయతీ సిబ్బందికి యూని ఫామ్ పంపిణీ చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ గోపి, ఏపీఓ నాగయ్య పాల్గొన్నారు.

గడువులోగా ఎఫ్ఎల్‌సీ పూర్తి చేయాలి

- ఈవీఎం నోడల్ అధికారి రాఘవేంద్ర



కలెక్టరేట్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న ఈవీఎం నోడల్ అధికారి రాఘవేంద్ర

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు ఈసీఐఎల్ ద్వారా వచ్చిన ఓటింగ్ యంత్రాలను నిర్దేశించిన గడువులోగా ఎఫ్ఎల్‌సీ(ఫస్ట్‌లెవల్ చెకింగ్) పూర్తి చేయాలని కర్ణాటక రాష్ట్ర జాయింట్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, ఈవీఎం నోడల్ అధికారి వి.రాఘవేంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో ఓటింగ్ యంత్రాల ఎఫ్ఎల్‌సీ నిర్వహణ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్‌సీ నిర్వహించే ఇంజనీర్లు, నియమించిన ఎన్నికల సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. విధులు నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది ఓటింగ్ యంత్రాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసీఐఎల్ నుంచి బ్యాలెట్ యూనిట్లు 2,019, కంట్రోల్ యూనిట్లు 1,649, వీవీప్యాడ్స్ 1,783 జిల్లాకు వచ్చాయని, ఈనెల 12 నుంచి 15 తేదీ వరకు బ్యాలెట్ యూనిట్లు 508, కంట్రోల్ యూనిట్లు 400, వీవీప్యాట్స్ 400 ఎఫ్ఎల్‌సీ చేశామన్నారు. పరిశీలనలో భాగంగా బ్యాలెట్ యూనిట్లు 10, కంట్రోల్ యూనిట్లు 3, వీవీ ప్యాట్స్ 1లను డిఫాల్ట్ గా గుర్తించామని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ వివరించారు. ఓటింగ్ యంత్రాల్లోఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, అలాగే స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పటిష్ట భద్రత, బారికేడింగ్, పోలీస్ బందోబస్తు నిరంతరం ఉండాలని సూచించారు. అనంతరం నిఘా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యస్. వెంకట్రావు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.కాంగ్రెస్ నాయకులు చకిలం రాజేశ్వరరావు, తంగేళ్ల కరుణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత సత్యనారాయణ, బీజేపీ నాయకుడు ఆబిద్, సీపీఎం నాయకుడు కోట గోపి, వైఎస్సార్‌సీపీ నేత డేగల రమేష్ ల సమక్షంలో ఎఫ్ఎల్‌సీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓలు రాజేంద్ర కుమార్, కిశోర్‌కుమార్, డీఎస్పీ నాగభూషణం, తహసీల్దార్ వెంకన్న, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పద్మారావు, ఏఓ శ్రీదేవి పాల్గొన్నారు.

పేట మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి అవార్డు



సూర్యాపేట పట్టణంలో నిర్మించిన మహాప్రస్థానం



- మహాప్రస్థానం, ఇంటిగ్రేటెడ్ నిర్మాణాలకు దక్కిన గుర్తింపు
- నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న చైర్మన్, కమిషనర్

సూర్యాపేట : మంత్రి జగదీష్ రెడ్డి ఇలాఖాకు రాష్ట్ర స్థాయిలో మరో పురస్కారం లభించింది. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన మహాప్రస్థానం, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డ్ ప్రకటించింది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పట్టణ ప్రగతి సంబరాలకు కొద్ది గంటల ముందు వెలువడిన ఈ ప్రకటనతో పేటలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పట్టణ ప్రగతి సంబరాల్లో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణమ్మ, కమిషనర్ రామాంజుల రెడ్డి ఈ అవార్డ్‌ను అందుకోనున్నారు. శానిటేషన్ లోనూ సూర్యాపేట పబ్లిక్ హెల్త్‌లో పని చేస్తున్న ఉద్యోగిని నకిరేకంటి సువార్తకు రాష్ట్ర స్థాయిలో సత్కారం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శానిటేషన్‌లో శ్రద్ధ చూపించడంతో పాటు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడంతో ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. రూ.5వేల నగదుతో పాటు నూతన వస్త్రాలతో మంత్రి కేటీఆర్ ఆమెను సత్కరించనున్నారు. కరోనా సమయంలోనూ అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను పబ్లిక్ హెల్త్ ఉద్యోగిని మెరుగ మారుతమ్మకు జాతీయ స్థాయిలో పురస్కారం లభించిన విషయం విదితమే. గడిచిన తొమ్మిదేళ్ల వ్యవధిలో సూర్యాపేట మున్సిపాలిటీకి మూడు జాతీయ స్థాయిలో, రెండు రాష్ట్ర స్థాయిలో అవార్డులు రావడంలో మంత్రి జగదీష్ రెడ్డి మార్క్ కనిపిస్తోంది. మంత్రి జగదీష్ రెడ్డి అధికారంలోకి రాగానే దత్తత తీసుకున్న ఆత్మకూర్ (ఎస్)మండలం ఏపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో అవార్డ్ లభించడం ఇందుకు తార్కాణం. జాతీయ స్థాయిలో సూర్యాపేట మున్సిపాలిటీకి శానిటేషన్, స్వచ్ఛతకు ఒక అవార్డ్, స్వచ్ఛత కు మరో అవార్డ్ లభించగా పర్యావరణం పరిరక్షణలో రాష్ట్ర స్థాయిలో అవార్డు దక్కింది. ఇప్పుడు తాజాగా సూర్యాపేట పట్టణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ -నాన్ వెజ్ మార్కెట్‌తో పాటు మహాప్రస్థానం నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డ్ ప్రకటించింది.

పేట ప్రజలకు అంకితం



స్థాయిలో సూర్యాపేట మున్సిపాలిటీకి వచ్చిన అవార్డులను పేట ప్రజ లకు అంకితం ఇస్తున్నాం. మంత్రి జగదీష్ రెడ్డి సహకారంతో పేట మున్సిపాలిటీలో మునుపెన్నడూ లేని విధంగా అద్భుతమైన అభివృద్ధి కళ్ల ముందే కన్పిస్తోంది. పేట మహా ప్రస్థానం, వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కు అవార్డు లభించడం చాలా సంతోషంగా ఉంది.

–రామాంజులరెడ్డి, కమిషనర్



మహాప్రస్థానం లోపలి భాగం



సూర్యాపేటలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్

నేడు పట్టణ ప్రగతి దినోత్సవం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీల్లో తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో ఉదయం 11 గంటలకు మహాప్రస్థానం వద్ద సభా కార్యక్రమం ఉంటుందని, తిరుమలగిరి మున్సిపాలిటీలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉదయం 9 గంటలకు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు, నేరేడుచర్ల మున్సిపాలిటీలో రాచకొండ సీతారామయ్య టౌన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు, కోదాడ మున్సిపాలిటీలో గుడుగుండ్ల ఫంక్షన్ హాల్‌లో 9గంటలకు పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువకులను మోసం చేస్తున్నాయని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కునుకుంట్ల సైదులు విమర్శించారు. ఈ నెల 24న సూర్యాపేటలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్న పీవైఎల్ 8వ జిల్లా మహాసభల పోస్టర్‌లను ఆత్మకూర్ మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ మండల అధ్యక్షుడు ఇరుగు నరేష్, నాగయ్య, సుధాకర్ రెడ్డి , వెంకన్న, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చట్టసభల్లో వాణి వినిపించాలి

- మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హుజూర్‌నగర్: ఎస్సీ వర్గీకరణ కోసం చట్టసభల్లో మన వాణి వినిపించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం చట్టసభల్లో మాట్లాడే వారి కోసమే మహాజన సోషలిస్ట్ పార్టీ పెట్టామని ఆయన చెప్పారు. ఏపోరాటంలోనైనా ధర్మం వైపు విజయం ఉంటుందన్నారు. అందుకు తెలంగాణ సాధనే మన కళ్ల ముందు కనబడుతుందని ఆయన ఉదహరించారు. తెలంగాణ స్ఫూర్తిగా అసెంబ్లీ ఎన్నికలలోపు ఎస్సీ వర్గీకరణ సాధిద్దామన్నారు. రాష్ట్రంలో జనాభాలో 1 శాతం కూడా లేని వారు నలుగురు మంత్రులుగా ఉన్నారని జనాభాలో 11 శాతం ఉన్న మాదిగలకు మంత్రి వర్గంలో స్థానం లేకుండా చేశారని దీనిని చూసి మనం గర్వపడాలా అని ఆయన ప్రశ్నించారు. ముదిగొండ సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుందుకూరు సోమన్న, కౌన్సిలర్ కాస్తాల శ్రవణ్ కుమార్, నాయకులు సోమేశ్వరరావు, సీహెచ్ బాల చంద్రుడు, ప్రసాద్, వినోద్, విశాఖ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- డీఎంహెచ్‌ఓ కోటాచలం



తిరుమలగిరిలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

తిరుమలగిరి (తుంగతుర్తి) : వైద్య సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి కోటాచలం హెచ్చరించారు. గురువారం తిరుమలగిరి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి వైద్య సేవలు పొందేలా సిబ్బంది కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సహజ కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ బిచ్చునాయక్, ఆయుష్ డాక్టర్ పద్మావతి, పల్లె దవాఖానా డాక్టర్ శిరీష, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మరింత ఆసరా

- పింఛన్ అదనంగా రూ.1000 పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం
- 23,710 మందికి ప్రయోజనం
- ఆనందం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు



తుంగతుర్తిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

నాగారం : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు అందించే ఆసరా పింఛన్‌ను అదనంగా రూ.1000 పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.3,016గా ఉన్న ఆసరా పింఛన్ తాజాగా ప్రభుత్వ ప్రకటనతో జూలై నుంచి రూ.4,016 పెరగనుంది. ఇంట్లో ఇద్దరు దివ్యాంగులుంటే ప్రతినెలా వారికి రూ.8032 వస్తుంది. వారికి ఇల్లు గడవడానికి కొంత ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆస్కారం ఉంటుంది. సీఎం కేసీఆర్ ప్రకటనతో జిల్లాలో 23,710 మందికి ప్రయోజనం చేకూరనుంది. జిల్లా వ్యాప్తంగా వృద్ధాప్య, వింతంతు, దివ్యాంగ, ఒంటరి మహిళలు, బీడీ, చేనేత, గీత కార్మికులు, బోదకాలు, డయాలసిస్ రోగులు ఇలా మొత్తం 1,35,264 మంది ప్రతి నెలా పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 23,710 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.7.15కోట్లను ఆసరా పింఛన్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. తాజా పెంపుతో రూ.2.37 కోట్ల నిధులను విడుదల చేయాల్సి ఉంటుంది.

రూ.9.52 కోట్లు..

జిల్లాలో 23,710 మంది దివ్యాంగులున్నారు. వీరికి ప్రతినెలా పింఛన్ కోసం ప్రభుత్వం రూ.7.15 కోట్లు కేటాయిస్తోంది. వచ్చే నెల నుంచి మరో రూ.1000 పెరుగుతుండటంతో అదనంగా రూ.2.37 కోట్లు జిల్లాకు కేటాయించనున్నారు. దీంతో ప్రతి నెల జిల్లాకు రూ.9.52 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

పెరగనున్న దరఖాస్తులు

దివ్యాంగులకు ప్రతి నెలా రూ.3,016 పింఛన్‌తో పాటు బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీ సౌకర్యముంది. ప్రభుత్వం నుంచి వివిధ రకాల రాయితీ రుణాలు వస్తుండటంతో చాలా మంది సదరం ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం 40శాతంపైన ఉంటేనే పింఛన్‌తో పాటు అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయి. కొందరు అనర్హులు సైతం ధ్రువీకరణ ప్రతం కావాలని సదరం శిబిరానికి వస్తున్నారు. వారిలో అన్ని రకాల విభాగాల్లో కలిపి అర్హులను పరిశీలిస్తే సగటున ఆసుపత్రికి వచ్చిన వారిలో 200 మందిలో కేవలం 60 నుంచి 70 లోపే అర్హులు ఉంటున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మిగితా వారంతా ప్రభుత్వ రాయితీ రుణాలు, బస్, రైతు పాస్‌ల కోసం వస్తున్నట్లు గుర్తిస్తున్నారు. ప్రభుత్వం రూ.4016 పింఛన్ ఇస్తుందని తెలిస్తే దరఖాస్తులు పెరిగే అవకాశముందంటున్నారు.

ఆనందంగా ఉంది

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.1000 పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. రూ.4016 పింఛన్ వస్తే దివ్యాంగులకు ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుంది.

– ఎండీ.సయ్యద్, దివ్యాంగుడు, తుంగతుర్తి.

లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం



ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్లతో లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పెంచిన పింఛన్‌పై వారం పది రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట.

క్లుప్తంగా

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మద్దిరాల: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని భగవాన్‌తండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భగవాన్‌తండాకు చెందిన జాటోతు భాస్కర్(36)కు బుధవారం రాత్రి తీవ్రమైన కడుపునొప్పి లేవగా, ఆ నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేనిది చూసి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చుట్టుపక్కల వారు గమనించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.


24 బస్తాల ధాన్యం దగ్ధం

గుండాల: గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పంటించగా, ఆ మంటలు పక్కనే ఉన్న సుమారు 24 బస్తాల ధాన్యానికి అంటుకొని దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గుండాల మండలంలోని పెద్దపడిశాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపడిశాల గ్రామానికి చెందిన గడ్డం దుర్గయ్య తన రెండెకరాల పొలంలో పండించిన ఆర్‌ఎస్‌ఆర్ వరి ధాన్యాన్ని(సన్న ధాన్యం) తన వ్యవసాయ బావి వద్ద బండ మీద ఎండబెట్టాడు. కాగా గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు వరి పొలంలో నిప్పు వేయడంతో వరి కొయ్యలు కాలుకుంటూ వచ్చి వడ్లకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి దుర్గయ్యకు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ వడ్లు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు.

ఆదుకునే వారి కోసం ఎదురుచూపు

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఆత్మకూరుకు చెందిన మల్లేశం
- ఇప్పటికే చికిత్సకు రూ. 5లక్షలు ఖర్చు
- మందులకు మరో రూ. 5లక్షలు అవసరమంటున్న వైద్యులు
- దాతలు సాయమందించాలని వేడుకోలు


మల్లేశంకు అన్నం తినిపిస్తున్న భార్య ధనలక్ష్మి



దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 99592 18134
గూగుల్‌పే నంబర్: 99592 18134

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బత్తిని మల్లేశం బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. చికిత్సకు ఇప్పటికే రూ.5లక్షల వరకు ఖర్చు చేశాడు. చేతిలో డబ్బులు లేని కారణంగా భార్య బంగారం అమ్మగా వచ్చిన డబ్బులు, బంధువులు సహకారం అందించగా వాటితో చికిత్స చేయించుకున్నాడు. వ్యాధి పూర్తిగా నయం కావడానికి మరో రూ.5లక్షలు అవసరమని డాక్టర్లు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.

కారు రిపేరు చేస్తున్న క్రమంలో..

మల్లేశం వయసు 38 సంవత్సరాలు. కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. భార్య ధనలక్ష్మి కూలి పని చేస్తుంటుంది. వీరికి ఇద్దరు సంతానం. తొమ్మిది సంవత్సరాల బాబు కృష్ణవంశీ, ఏడు సంవత్సరాల పాప లిఖిత ఉన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం తాను నడుపుతున్న కారును రిపేరు చేస్తున్న క్రమంలో తలకు డోర్ తగిలి తీవ్ర గాయమైంది. దీంతో భువనగిరిలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి తలనొప్పితో బాధపడుతున్నాడు. రెండు సంవత్సరాల అనంతరం అతనికి పెరాలిసిస్ వచ్చింది. దీంతో కళ్లు కనిపించకుండా పోయాయి. తలనొప్పి తీవ్రం కావడంతో గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పెరాలసిస్ సమస్యతో బ్రెయిన్ ట్యూమర్ ఫామ్ అయినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. అక్కడి నుంచి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ హాస్పిటల్‌లో చూపించుకున్నాడు. చికిత్స నిమిత్తం రూ. 5లక్షలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం ఆరు నెలల నుంచి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపించుకుంటున్నాడు. నెలకు నాలుగు సార్లు ట్రీట్మెంట్ చేయించుకోవాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. మందుల ఖర్చు నెలకు రూ. 50వేల వరకు అవుతుందని, ఏడాది మొత్తం వాడితేనే వ్యాధి తగ్గుముఖం పడుతుందని, లేకుంటే కష్టమని డాక్టర్లు చెబుతున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో డబ్బులు లేక ఈ నెల హాస్పిటల్‌కు కూడా పోలేదని వాపోయారు. మల్లేశం మామూలు వ్యక్తిగా మారాలంటే రూ. 5లక్షల వరకు అవసరం ఉంటుంది. దాతలు సహకరించి ట్రీట్‌మెంట్ కోసం ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న బత్తిని మల్లేశం

చెన్నారంలో భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు


భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న శంకర్ నాయక్, గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు


కేక్ కట్ చేస్తున్న భట్టివిక్రమార్క. చిత్రంలో దుబ్బాక నర్సింహారెడ్డి తదితరులు

- పాదయాత్ర క్యాంపు వద్ద వేడుకల్లో పాల్గొన్న సీఎల్పీ నేత

నల్లగొండ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నల్లగొండ నియోజకవర్గం పరిధిలోని జి.చెన్నారం గ్రామం సమీపంలో పాదయాత్ర నిర్వహిస్తున్న క్యాంపు వద్ద వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. భట్టి సతీమణి నందిని, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్యలు ఆయనతో కట్ చేయించారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటాపాటలతో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అమెరికాలో ఉన్న పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఫోన్ చేసి భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు చెన్నారం గ్రామం తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు దుబ్బాక నర్సింహారెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నాయకులు బీర్ల ఐలయ్య, కైలాస్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, వడ్డె నారాయణ, సత్యం, వెంకట్, పద్మ, శకుంతలారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏపీ నేతలు

ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో 30 మంది సభ్యుల బృందం చెన్నారానికి వచ్చిన భట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పాదయాత్ర శిబిరం వద్ద పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి పద్మశ్రీ , విజయవాడ సిటీ ప్రెసిడెంట్ నారిశెట్టి నర్సింహారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్ర కిరణ్, అమరావతి అధ్యక్షుడు సురేష్, నాయకులు జంధ్యాల శాస్త్రీ, పోతురాజు ఏసు, వేముల శ్రీనివాస్, దోసపాటి గిరి, రామకృష్ణ, చెరుకు ఆనందరావు, గౌస్, రమణ, సురేష్, గొల్ల కృష్ణ, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. పాదయాత్ర విజయవంతంగా పూర్తికావాలని విజయవాడ కనకదుర్గ అమ్మవారికి పూజలు నిర్వహించినట్లు వారు చెప్పారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

సూర్యాపేట రూరల్: సూర్యాపేట పట్టణ పరిధిలోని జనగాం క్రాస్‌రోడ్డులో గురువారం ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. అతడిని అదుపు చేయబోయిన కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం రాజునాయక్ తండాకు చెందిన ధరావత్ చందు గురువారం మద్యం సేవించి సూర్యాపేట పట్టణ పరిధిలోని జనగాం క్రాస్ రోడ్డులో నిల్చున్నాడు. అదే సమయంలో బస్సు దిగిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ అతడిని అదుపు చేయడానికి ప్రయత్నించాడు. మద్యం మత్తులో ఉన్న చందు కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. చందును అదుపులోకి తీసుకుని బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు.

చౌటుప్పల్ బస్‌స్టేషన్‌లో వృద్ధురాలు మృతి


మారమ్మ మృతదేహం

చౌటుప్పల్: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి ఓ వృద్ధురాలు ఆకస్మికంగా మృతిచెందింది. వివరాలు.. నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన పంకెర్ల మారమ్మ(65) జ్వరంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం ఆమెను భర్త దేవయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం సాయంత్రం స్వగ్రామానికి బయల్దేరారు. హైదరాబాద్‌లో బస్సు ఎక్కి చౌటుప్పల్ బస్‌స్టేషన్‌లో రాత్రి దిగి, స్వగ్రామానికి వెళ్లే మరో బస్సు కోసం వేచి చూస్తున్నారు. అక్కడే ఉన్న బెంచీపై కూర్చొని భార్యాభర్తలు మాట్లాడుకుంటుండగా అంతలోనే మారమ్మ ఆకస్మికంగా కిందపడిపోయింది. పక్కనే ఉన్న ప్రయాణికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి అప్పటికే మారమ్మ మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా మారమ్మ వడదెబ్బకు గురై మృతిచెంది ఉండవచ్చునని ప్రయాణికులు భావిస్తున్నారు. తన కళ్ల ముందే భార్య మృతిచెందడంతో భర్త దేవయ్య బోరున విలపించాడు.

స్నేహితుడే హంతకుడు

- మద్యం మత్తులో ఘాతుకం
- వీడిన హత్య కేసు మిస్టరీ


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణంలోని సుందరయ్యనగర్‌లో గత నెల 31న రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వ్యక్తిని అతడి స్నేహితుడే మద్యం మత్తులో హతమార్చినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ జి. రాజశేఖర్ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన నవిల నవీన్, ఆకారపు శేఖర్ ప్రాణ స్నేహితులు. వీరిద్దరూ టిప్పర్ డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 31న అర్ధరాత్రి శేఖర్, నవీన్‌లు ఇద్దరు కలిసి సుందరయ్య కాలనీలో నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ పక్కనే దొరికిన ఖాళీ బీరు సీసాతో శేఖర్ తలపై బలంగా కొట్టడంతో అతడు కిందపడిపోయాడు. అయినప్పటికీ ఆగకుండా ఇటుకతో శేఖర్ తలపై కొట్టి, కడుపులో తన్నగా అక్కడికక్కడే మృతిచెందగా, నవీన్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు శేఖర్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శేఖర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కాల్‌లిస్ట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు నవీన్‌ను గురువారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించగా, చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ యాకూబ్, హెడ్‌కానిస్టేబుళ్లు గొర్ల కృష్ణ, గోదిశ కరుణాకర్, ఆనంద్ పాల్గొన్నారు.

గుండ్లపల్లి చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

మఠంపల్లి: మండలంలోని గుండ్లపల్లి గ్రామ చెరువులో గురువారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మఠంపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం గ్రామానికి చెందిన అల్లం పేరయ్య(41) మతిస్థిమితం సరిగ్గా లేక గతంలో రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ నెల 13న కూడా ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడు మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. అయితే గుండ్లపల్లి గ్రామ చెరువులో గురువారం చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులకు వ్యక్తి మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు రఘునాథపాలెం గ్రామానికి చెందిన అల్లం రోశయ్య కుమారుడు అల్లం పేరయ్యగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన


ధ్రువపత్రాల పరిశీలనను తనిఖీ చేస్తున్న ఎస్పీ

సూర్యాపేటక్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేంద్రప్రసాద్ స్వయంగా పరిశీలించి మాట్లాడుతూ అభ్యర్థులు సకాలంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకోవాలని, అడ్మిట్ కార్డులో తెలిపిన ధ్రువపత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. గురువారం నిర్వహించిన ధృవపత్రాల పరిశీలనకు 415 మంది పురుష అభ్యర్థులు, 132 మంది మహిళా అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేటటౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగల వెంకటేష్ అన్నారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపగాని రవికుమార్, తమ్మన బోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లారీని ఢీకొట్టిన యాక్టీవా.. యువకుడు దుర్మరణం

మాడుగులపల్లి: యాక్టీవాపై వెళ్తున్న యువకుడు రోడ్డు వెంట ఆగి ఉన్న లారీని ఢీకొట్టి దుర్మరణం చెందాడు. మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా తాటికొండ మండలం లాం గ్రామానికి చెందిన మాతంగి సిద్ధు(24) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన అతడు బుధవారం సాయంత్రం యాక్టీవాపై హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. రాత్రి 10గంటల సమయంలో మాడుగులపల్లి టోల్‌ప్లాజా సమీపంలోని కంకర మిల్లు వద్దకు రాగానే యాక్టీవా అదుపుతప్పి రోడ్డు వెంట నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో సిద్ధు తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని హుటాహుటిన నల్లగొండ ప్రభుత్వ దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ పరిశీలించారు. గురువారం మృతుడి మామ చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

ఇంట్లోంచి వెళ్లిన ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యం

- తల్లికి అప్పగించిన పోలీసులు


ఇద్దరు బాలురను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

తుర్కపల్లి: తల్లి మందలించిందని మనస్తాపంతో ఇంటి నుంచి పారిపోయిన ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యమైంది. తుర్కపల్లి పోలీసులు గురువారం ఇద్దరిని వారి తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా దండుపల్లికి చెందిన పిట్టల యాదమ్మ పదిహేను సంవత్సరాలుగా తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో నివాసముంటూ కోళ్ల షెడ్డులో కూలీగా పనిచేస్తుంది. ఈమె భర్త దేవేందర్‌రావుకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య అయిన పిట్టల యాదమ్మకు కుమారులు విజయ్(15) చరణ్(9) ఉన్నారు. పెద్ద కుమారుడు విజయ్ దత్తాయపల్లిలో యాదమ్మ వద్దే ఉంటుండగా, చిన్నకొడుకు చరణ్ మేడ్చల్ జిల్లా దండుపల్లిలో తండ్రి వద్ద ఉండేవాడు. దేవేందర్‌రావు రెండు నెలల క్రితం చింతచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. దీంతో చిన్న కుమారుడిని కూడా యాదమ్మ దత్తాయపల్లికి తీసుకొచ్చింది.

తల్లి తిట్టిందని..

విజయ్, చరణ్‌లు రోజూ గొడవ పడుతుండడంతో తల్లి యాదమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వారిద్దరు రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న రూ.2వేల నగదు, టీవీఎస్ ఎక్సెల్ తీసుకుని ఇంటి నుంచి పారిపోయారు. మంగళవారం రాత్రి వరకు పిల్లల కోసం యాదమ్మ చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఉదయం తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా ఇద్దరూ భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి దుర్గమ్మ గుడి వద్ద ఉన్నట్లు గుర్తించి వారిని గురువారం తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తాము తీసుకువెళ్లిన టీవీఎస్ ఎక్సెల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించి తీసుకువెళ్లారని విజయ్, చరణ్ పోలీసులకు తెలిపారు. ఇద్దరు బాలురను పోలీస్ స్టేషన్‌లో తల్లి యాదమ్మకు అప్పగించారు. పిల్లలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తుర్కపల్లి: మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామ స్టేజీ గురువారం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. మృతుడు వేసుకున్న షర్ట్ పైన 'శేఖర్ టైలర్, భోగారం' అని లేబుల్ ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామిరెడ్డిని గెలిపించాలి


రామిరెడ్డిని సత్కరిస్తున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరిచి గెలిపించాలని న్యాయవాదులు కోరారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం రామిరెడ్డిని శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, కార్యదర్శి జక్కుల నాగేశ్వరరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: పేకాట స్థావరంపై గురువారం మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం ప్రకాశ్‌నగర్‌లోని కాలువ సమీపంలో గల ఖాళీ స్థలంలో గురువారం కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. వారి వద్ద నుంచి రూ.18,650 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- అర కిలో వెండి సామగ్రి అపహరణ

కొండమల్లేపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి అర కిలో వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. ఈ సంఘటన గురువారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని విలేకరుల కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. విలేకరుల కాలనీలో నివాసముంటున్న దుండిగళ్ల అశోక్ భార్య గురువారం ఉదయం యాదగిరిగుట్ట దర్శనానికి వెళ్లింది. ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అశోక్ రోజుమాదిరిగా కాలేజీకి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. సాయంత్రం అశోక్ ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండడం, ఇంట్లోని సామగ్రి చిందరవరంగా ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా అరకిలో వెండి సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ వీరబాబు క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేలకు సారం.. పంటకు జీవం

- సేంద్రియ వ్యవసాయం వైపు రైతుల మొగ్గు
- అధిక దిగుబడులతో పాటు సాగు ఖర్చులూ తగ్గుతాయని నిపుణుల సూచన



హుజూర్‌నగర్‌రూరల్ : మెరుగైన పంట దిగుబడి సాధించేందుకు అన్నదాతలు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. వానాకాలం సీజన్ ఆరంభం కానుండటంతో రైతులు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. నేలను సారవంతం చేయడం, భూసారం పెంచడం, దుక్కులు దున్నడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. భూముల్లో సారం కోల్పోయి పంట దిగుబడి రాక ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్న రైతులు పెట్టుబడుల భారాన్ని తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో సేంద్రియ ఎరువులపై ఆసక్తి కనబరుస్తున్నారు.


ఎరువు కోసం పొలంలో తోలిన గొర్రెల మంద


సేంద్రియ ఎరువులు వాడితే..

రసాయనిక ఎరువుల ధరలు భారీగా పెరగడంతో పాటు వాటినే ఎక్కువగా రైతులు వాడుతుండడంతో భూములు సారం కోల్పోయి క్రమంగా దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు పంట దిగుబడుల కోసం చెరువు మట్టి, పశువుల ఎరువులతో భూసారం పెరిగి దిగుబడులు వస్తాయని పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడకంతో దిగుబడులు పడిపోతున్నాయి.


పొలంలో పోసిన చెరువు మట్టి

ఈ నేపథ్యంలో కృత్రిమ ఎరువుల కంటే సేంద్రియ వ్యవసాయంతో భూసారాన్ని రక్షించడంతో పాటు బంగారు పంటలు పండించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. భూమి నిస్సారం చేసే రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడితే సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని సలహాలు ఇస్తున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం కంపోస్ట్ ఎరువు తయారీతో పాటు పొలాల్లో పశువుల పెంటలు పెట్టడం, సేకరించిన ఎరువులను పొలాల్లో చల్లుకోవడం లాంటి పనులతో రైతులు బిజీబిజీగా ఉన్నారు.

సేంద్రియ ఎరువునే వాడుతున్నా..



పొలంలో మూడేండ్లుగా సేంద్రియ ఎరువులనే వాడుతున్నాం. దీంతో గతేడాది మంచి దిగుబడి వచ్చింది. రసాయన ఎరువు వాడకం తగ్గించడంతో మొక్క ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడి వస్తుంది. సేంద్రియ ఎరువుతో పండించిన పంటలు బాగున్నాయి. ఈ వరి ధాన్యం బియ్యం పట్టుకుని ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.
– గునగంటి కనకయ్య, రైతు సీతరాంపురం

అనేక పోషకాలు ఉంటాయి



సేంద్రియ ఎరువులలో అనేక పోషకాలు ఉంటాయి. రసాయన ఎరువులు పదేపదే వాడితే మేలుకంటే కీడే ఎక్కువ. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. పొలాల్లో గొర్రెలు, మేకల పెంటలను పెట్టుకోవాలి. కోళ్ల ఎరువులతోనూ మంచి ఫలితాలుంటాయి.
– రావిరాల స్వర్ణ ఏఓ, హుజూర్‌నగర్